www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 1సెప్టెంబర్ 2025

5

అన్నమయ్య

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' రద్దు

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి - రాయచోటి

నేడు రాజంపేట మండలం బోయనపల్లిలోముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న అర్జీలు, వాటి పరిష్కార స్థితి గురించి సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100లో నేరుగా సంప్రదించగలరని తెలిపారు. జిల్లా ప్రజలు ఈవిషయాన్ని గమనించాలని కోరారు.

'అన్నమయ్య'కు పునరుద్ధరణేది!

- ఉద్యాన పంటలకు ప్రోత్సాహం కరువు
- జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనులకు మోక్షమెప్పుడో
- ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం ఏదీ
- నేడు రాజంపేటకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాక

అన్నమయ్య జిల్లా ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. జిల్లా రాజకీయ నాయకత్వం చిత్తశుద్ధి లేమి, కూటమి సర్కారు నిర్లక్ష్యం వెరసి జిల్లా ప్రగతి నీరోడుతోంది. దీనికితోడు సాగునీటి ప్రాజెక్టుల పనులు, నిర్వాసితులకు అందని పరిహారం, ఉద్యాన సాగుకు కొరవడిన ప్రోత్సాహం, కదలని జాతీయ రహదారుల నిర్మాణాలు, రాజంపేట, మదనపల్లి, ప్రాంతాల్లో పెద్దఎత్తున భూకబ్జాలు, పారిశ్రామిక ప్రగతి తిరోగమనం వంటి సమస్యలతో కునారిల్లుతోంది. రాష్ట్రంలోనే జిల్లా ఉద్యాన పంటలకు పుట్టి నిల్లు. జిల్లా మామిడి, అరటి, నిమ్మ, బొప్పాయి, టమోటా తోటలకు ప్రసిద్ధి. ఇటువంటి ఉద్యాన ప్రాంతం వర్షాభావ పరిస్థితుల కారణంగా తల్ల కిందులవుతోంది. ఇటువంటి కరువు ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు చొరవ కరువు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇటు వంటి పరిస్థితుల నేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రాజంపేటను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలును కోరుతూ సాధన కమిటీల ఆందోళనల నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాజంపేట పర్యటనపై కథనం...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. రాష్ట్రంలో కూటమి సర్కారు పాలన ఆశించిన రీతిలో సాగడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రాజంపేటను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరిస్తామని ఇచ్చిన కూటమి హామీ కేబినెట్ సమావేశాల్లో నామమాత్ర ప్రస్తావన చేయకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. దీనికితోడు రాజంపేట రైల్వేలైన్ కింద ఆయుబి ఏర్పాటు సమస్య పట్టణాన్ని వేదనకు గురి చేస్తోంది. ఇదిలా ఉండగా రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా ఉద్యాన పంటల సాగులో అగ్రపీఠిన నిలుస్తోంది. జిల్లాలో సుమారు 1.13 లక్ష ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. కానీ ఉద్యాన పంటలకు ప్రోత్సాహం కరువైంది. జిల్లాలో అత్యధికంగా 77 వేల ఎకరాల్లో మామిడి, తొమ్మిది వేల ఎకరాల్లో అరటి, తొమ్మిది వేల ఎకరాల్లో బొప్పాయి, ఏడు వేల ఎకరాల్లో టమోటా పంటలు సహా ఇతర పంటలు పెద్దఎత్తున సాగులో ఉన్న సంగతి తెలిసిందే. ఇటువంటి ఉద్యాన జిల్లాకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడి నుంచి పలు రకాల పండ్లు విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇంతటి ప్రాముఖ్యతను కలిగిన జిల్లాలో మామిడి తోటలు లేమి కారణంగా తోటలపై గొడ్డలి వేటు పడుతోంది. అరటి, టమోటా రైతు ధరల నిలకడ లేమి కారణంగా దోపిడీ గురవవుతున్నారు. బొప్పాయి రైతు దళారుల మాయా జాలంలో విలవిలాడుతున్నారు. ఇటువంటి పరిస్థితిని అధిగమించడానికి కూటమి సర్కారు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఉద్యాన పంటలకు నిలయమైన రైల్వేకోడూరులో ఆప్సా వంటి పండ్ల రసాల పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రతిపక్ష నేత హెూదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుకు ఆమడదూరంలో నిలిచింది. జిఎన్ ఎస్ఎస్ ఫేజ్-2 పనుల్లో ఎటువంటి పురోగతీ కనిపించడం లేదు. ముది వేడు రిజర్వాయర్ నిర్మాణ పనులు ఎక్కడికి అక్కడే ఆగిన పరిస్థితి కనిపిస్తోంది. రూ.ఐదు వేల కోట్లతో కూడిన కాలేటివాగు 80 శాతం పనులు రాజకీయ కారణాలతో నిలిచిపోయింది. ఫలితంగా రాయచోటి, చక్రాయ పేట మండలాల్లో సుమారు 72 చెరువుల కింద వేలాది ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది.

వరదల్లో కొట్టుకుపోయిన అన్నమయ్య డ్యామ్

దీనికితోడు 2025 ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం వెంటా డుతోంది. జిల్లాలోని 30 మండలాల్లో సుమారు 20 మండలాలు సాధారణ వర్షపాతం నమోదు, ఎనిమిది మండలాలు తీవ్ర కరువు మేఘాలు దట్టంగా కమ్ముకోవడం ఆందోళన కలిగిస్తోంది. రాజంపేట నియోజక వర్గ పరిధిలో 200 ఎకరాల్లో ఉద్యాన యూని వర్శిటీ ఏర్పాటు హామీ అమలుకు నోచుకోవడం లేదు. 2014-2015 టిడిపి హయాంలో చేసిన ప్రయత్నం సాకారానికి నోచుకోవడం లేదు. 20 24 సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి న నేపథ్యంలో ఉద్యాన యూనివర్శిటీ ఏర్పాటుకు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్రంలోనే ఉద్యాన పంటల సాగులో అన్నమయ్య జిల్లా అగ్రపీఠిన నిలుస్తోంది. మామిడి, అరటి, చీనీ తోటలు సహా పలు ఇతర ఉద్యాన నర్సరీలతో కళకళలాడుతోంది. ఇటువంటి ఉద్యాన పంటలకు నిలయమైన ప్రాంతంలో అప్సా వంటి పండ్ల రసాల పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు.సాగునీటి ప్రాజెక్టుల పనులు పడకేయడం ఆందోళన కలిగిస్తోంది. జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 పనులకు కదలిక ఎప్పుడో తెలియడం లేదు. 2014 ఫిబ్రవరిలో ఫేజ్-2 పనులకు పిలిచిన టెండర్లలో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఫేజ్-2లో గాలేరు-నగరి కాల్వ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. హంద్రీ-నీవా కాల్వ ద్వారా కుప్పానికి నీళ్లు తరలించడం బాగానే ఉంది. కానీ అన్నమయ్య జిల్లాలోని శ్రీనివాసపురం రిజ ర్వాయర్‌ను విస్మరించడంలో ఆంతర్యమేమిటో తెలియ డం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, ముదివేడు, ఝరికోన రిజర్వాయర్ పనుల్లో ఎటువంటి పురోగతి లేకపోవడం విస్మయాన్ని కలిగి స్తోంది. వెలిగల్లు ఎత్తిపోతల పథకం పనులకు మోక్షమెప్పు డో తెలియడం లేదు. కడప - తిరుపతి జాతీయ రహదారి నిర్మాణం సర్వే దశలో కునారి ల్లుతోంది. దీంతోపాటు కడప-తిరుపతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి సర్వే దశను దాటడం లేదు. దీంతోపాటు ఓబులవారిపల్లి-కృష్ణపట్నం ప్యాసింజర్ రైలు ఎప్పటికి నడుస్తుందో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. బెంగళూరు-విజయవాడ ఎన్‌హెచ్ నిర్వాసితులు పరిహారానికి ప్రద క్షిణలు చేయాల్సి వస్తోంది. గ్రీవెన్స్‌సెల్, స్పందన, ప్రజాసమస్యల పరిష్కార వేదికల చుట్టూ తిరుగుతున్నప్పకీ పరిష్కారం కావడం లేదు. ఇదిలా ఉండగా నాలుగేళ్ల కిందట అన్న మయ్య రిజర్వాయర్ గల్లంతైన ఘటనలో నష్టపోయిన బాధితులకు మౌలిక వసతుల కల్పనలో తాత్సారం జరుగుతోంది.

సంచార జాతులు దేశభక్తులకు స్ఫూర్తి

- ఎపి వడ్డెర మేధావుల ఫోరం కన్వీనర్ కె.జీవానందం

ప్రజాశక్తి - రాయచోటి : సంచార జాతులు దేశ భక్తులకు స్ఫూర్తి అని, 1952న ఆగస్టు 31న అప్పటి భారత ప్రభుత్వం 50 లక్షల సంచారజాతుల కుటుంబాలకు స్వే చ్ఛా వాయువులు ప్రసాదించిన రోజుగా ఎపి వడ్డెర మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీ నర్ కె.జీవా నందం అన్నారు. ఆదివారం పట్టణంలోని ఒక ప్రయివేట్ మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన సంచారజాతి కుటుం బాలనుద్దేశించి అయన మాట్లాడారు. ఈ చారిత్రాత్మక క్షణాన్ని స్మరించుకోవడానికి ప్రతి సంవ త్సరమూ ఆగస్టు 31ని 'ముక్తి దివస్' గా దేశవ్యాప్తంగా నిర్వహిం చుకుంటున్నామని చెప్పారు. 1871లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం, స్వేచ్ఛకోసం పోరాడుతూ స్వాతంత్ర్య కాంక్షను ఊరూరూతిరుగుతూ ప్రజల్లో నింపుతున్నారన్న అక్కసుతో సంచార జాతులను నేరతెగల చట్టం" (సి.టి యాక్ట్) పేరుతో దొంగలుగా,దోపిడీదారులుగా,ముద్రవేసి జైలుపాలు చేశారన్నారు. నిజానికి సంచారజాతులు మట్టిలో మాణి క్యాలని, చరిత్ర గుర్తించని వెలిగే దీపాలని చెప్పారు. పురాతనకళలకు నేడు ఆదరణ కరువైనప్పటికీ భారంగా బతుకులీడుస్తూ సామాజికంగా, ఆర్థికంగా, విద్యా, ఉపాధి అవకాశాలు లేక మౌన జాతులుగా, స్వరంలేని జాతులుగా రాజ్యాధికారానికి దూరమై నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించి కల్పించాలన్నారు.

పరీక్షలు పాత విధానంలోనే నిర్వహించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్ : బుక్లెట్ అసెస్మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టడంతో బోధనలో ఉపాధ్యాయులకు ఆటంకం కలుగుతన్నందున పాత విధానంలోనే పరీక్షలు నిర్వహించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబీర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం రాయ చోటిలోని వై. వి. నాగిరెడ్డి డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి పూర్తిగా మినహాయించాలన్నారు. ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల విధానాన్ని పాత పద్ధతిలోనే నిర్వ హించాలని ప్రభుత్వాన్ని కోరారు. యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం, శిక్షణా తరగతుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేశారని, ఇవి కాకుండా ప్రతీరోజూ ఏదో ఒక సమాచారం విద్యాశాఖ అత్యవసరమంటూ యాప్‌లలో అప్‌లోడ్ చేయమంటున్నదని తెలిపారు. విద్యా కిట్ల పంపిణీ ఆన్‌లైన్ ధృవీకరణ చేయాలంటూ ఒత్తిడి సరేసరని, యాప్‌ల భారం తగ్గిస్తామని చెబుతూనే ఒకే యాప్‌లో అనేకరకాల సమా చారాలు పెట్టమంటూ అధి కారులు ఒత్తిడి పెడుతున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన ఫార్మేటివ్ అసెస్మెంట్‌లో సిలబస్‌లో లేని ప్రశ్నలను ఇచ్చి విద్యార్థు లను గందరగోళ పరిస్థితు ల్లోకి నెట్టడంతో పాటు మా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు పరీక్షల్లో రావనే అపవాదు వస్తున్న దని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకటో తరగతి విద్యార్థులు పేరాగ్రాఫ్ చదివి ప్రశ్నలకు జవాబులు తెలియజేయమనడం వారి స్థాయిని దృష్టిలో ఉంచుకోకుండా వ్యవహరించడం తగదన్నారు. పరీక్ష విధానం పాత పద్ధతి లోనే కొనసా గించాలని కోరారు. ప్రాజెక్ట్ వర్క్ అనేది విద్యార్థికి కొంత సమయం ఇవ్వడం ద్వారా తన సృజనాత్మ కతను ఉపయో గించి, తనకు తానుగా ఆలోచించుకొని, సమాచారం సేకరించి, ఫలితాన్ని ప్రదర్శించే విధంగా ఉండాలన్నారు. పరీక్ష సమయంలో అప్పటికప్పుడే పూర్తిచే యించడం సమంజసంగా లేదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రెడ్డి ముని సుధాకర్, చిన్నమండెం మండల అధ్యక్షు డు చంద్రశేఖర్ రెడ్డి, సహాధ్యక్షుడు కిఫాయత్, నాయకులు రఖీబ్, ఆదిల్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

- అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి
- శిథిలావస్థలో ఉన్న భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు
- బాల్య వివాహాల నివారణకు అవగాహన సదస్సులు
- ఐసిడిఎస్ పీడీ హైమావతి

ముఖా ముఖి..

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంతో ఆరోగ్యం కాపాడుకోవచ్చని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారతాధికారి హైమావతి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ఐసిడిఎస్ కార్యాలయాల పని తీరు, అంగన్వాడీ కేంద్రాలలో చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికా హారం ఎలా అందించాలో, బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యల గురించి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖీలో ఆమె వివరించారు.

ఐసిడిఎస్ కార్యాలయాల వివరాలు తెలపండి?

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారిక అధికారి కార్యాలయం జిల్లా కేంద్రం రాయచోటిలో ఉంది. జిల్లాలో 11 ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాలు ఉన్నాయి. బి.కొత్తకోట, చిట్వేల్, లక్కి రెడ్డిపల్లి, మదనపల్లి, పీలేరు, రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, టి.సుండుపల్లి, తంబల్లపల్లి, వాల్మీకిపురం ప్రాంతాలలో ఉన్నాయి.

ఐసిడి ఎస్ కేంద్రా పని వివరాలు తెలపండి?

ఐసిడిఎస్ కార్యాలయాల పరిధిలో పనిచేసే అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తాయి. అంగన్వాడీ కేంద్రాల్లో ఉదయం 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు అల్పాహారంగా ఉడికించిన కోడి గుడ్డు ఇస్తాం. మధ్యాహ్నం వరకు పిల్లలకు ప్రీస్కూలు యాక్టివిటీస్ చేయిస్తాం. మధ్యాహ్నం పైన 100 మిల్లీలీటర్ల పాలు ఇచ్చి ఆట, పాటలు నేర్పిస్తాం.

అంగన్వాడీల్లో గర్భిణులు, బాలింతల వివరాలు చెప్పండి?

జిల్లా వ్యాప్తంగా మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలు 1828, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 405, సహాయకురాళ్లు 1771 పనిచేయుచున్నారు, 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 49,820, మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 41967 గర్భిణులు, బాలింతలు 16565 మంది ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఖాళీల వివరాలు తెలపండి?

జిల్లాలో మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలు 30, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 12, సహాయకురాళ్లు 87, (కోర్ట్ కేసులు, ప్రమోషన్లు, షిఫ్టింగ్‌తో సహా కలిపి) ఖాళీలు ఉన్నాయి.

ఐసిడిఎస్ అదనపు కార్యాలయాలకు ప్రతిపాదన పంపారా?

లేదు. అన్నమయ్య జిల్లాకు సరిపడా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాలున్నాయి.

పౌష్టికాహారం వివరాలు తెలపండి?

ప్రతినెలా గర్భిణులకు, బాలింతలకు 3 కిలోల బియ్యం, 1 కిలో కందిపప్పు, 500 గ్రాముల ఆయిల్, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు, 2 కిలోల రాగిపిండి,1 కేజీ అటుకులు, 250గ్రాముల వేరుశెనగ చిక్కీ, 250గ్రాముల బెల్లం, 250 గ్రాముల ఎండు ఖర్జూరం రెండు విడతలుగా ఇంటికి అందజేస్తున్నాం. 7 నెలల నుంచి 3 ఏళ్ల పిల్లలకు 2.5 కిలోల బాలామృతం, 25 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు రెండు విడతలుగా ఇంటికి టిహెచ్‌ఆర్ ఇస్తున్నాం. 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల పిల్లలకు రోజూ అంగన్వాడీ కేంద్రానికి ఒకపూట సంపూర్ణ భోజనం ప్రభుత్వం వారు నిర్దేశించిన మెనూ ప్రకారం పెడుతున్నాం. రోజూ డికించిన కోడి గుడ్డు, 100మిల్లీ లీటర్ల పాలు ఇస్తున్నాం.

ఐసిడిఎస్ సొంత, అద్దె భవనాలు ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలు 2,275 ఉన్నాయి. సొంత భవనాలు 1,030, అద్దె భవనాలు 795, అద్దె లేని భవనాలు 450,(స్కూలు క్లాస్ రూములలో) ఉన్నాయి.

జిల్లాలో శిథిలావస్థకు చేరుకున్న ఐసిడిసి భవనాలు ఎన్నున్నాయి?

జిల్లాలో శిథిలావస్థలో ఉన్న భవనాలు ఆరు ఉన్నాయి. వాటి మరమ్మతుల కోసం ఉన్నత అధికారులకు ప్రతిపాదనలను పంపాం.

బాల్య వివాహాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

బాల్య వివాహాలు నివారించడానికి జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశాం. అంగన్వావాడీ కార్యకర్త నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు అందరం కలిసి గ్రామాలలో పాఠశాలలో బాలికల హాస్టల్లో పిల్లలకు తల్లిదండ్రులకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం.

జిల్లాలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లాలో 2 సిడిపిఒ,1 ఎసి డిపిఒ పోస్టులు ఖాళీగా సీనియర్ సహాయకులు, 1 జూనియర్ సహాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.1 సీనియర్ సహాయకులు,1 జూనియర్ సహాయకులు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

గర్భిణులు, బాలింతలకు, తల్లిదండ్రులకు సలహాలేమైనా ఇస్తారా?

గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ ద్వారా అందించే పౌష్టికాహారం వారు మాత్రమే తినాలి. అప్పుడే వారికి సరైన పౌష్టికాహారం అందుతుంది. వారికి అందుబాటులో ఉన్న ఆకుకూరలు బాగా తినాలి. హెల్త్ చెకప్‌లు తరచుగా చేయించుకోవాలి. అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, ఆశా కార్యక్తలు, మెడికల్ ఆఫీసర్ల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలి.

దోబీఘాట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం రాజంపేట మండలం బోయనపల్లిలో పాల్గొనబోయే పేదల సేవ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. ఆదివారం బోయినపల్లిలో సిఎం ఏర్పాట్లకు సంబంధించి హెలిప్యాడ్, దోబీ ఘాట్, ఎన్టీఆర్ పింఛన్ లబ్ధిదారుల ఇళ్లు, ప్రజా వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు అనుగుణంగా వేదిక నిర్మాణం, పాల్గొనే లబ్ధిదారుల కోసం కూర్చోవడానికి అవసరమైన సదుపాయాలు, తాగునీటి వసతి, శానిటేషన్, పార్కింగ్ సంబంధిత ఏర్పాట్లన్నీ పూర్తయ్యా యన్నారు. ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండా అధికార బృందాలు సకాలంలో పనులను పూర్తి చేసారని చెప్పారు. పర్యటనలో ముఖ్యమంత్రి స్వయంగా పలకరించబోయే రజక లబ్ధిదారుల జాబితా, వారికి అందించబోయే ప్రయోజనాలు, సౌకర్యాలు క్షుణ్ణంగా సమీక్షిస్తారన్నారు. సమా వేశానికి హాజరయ్యే ప్రజలు ఎలాంటి ఇబ్బంది లేకుండా వేదిక వద్దకు చేరుకునేలా ప్రత్యేక రవాణా సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వేదిక పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సిసి కెమెరాలు, క్షేత్ర స్థాయి భద్రతా బలగాలను విస్తృతంగా మోహరిం చారన్నారు. ప్రజల రాక పోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక ప్రణాళిక చేపట్టామని తెలిపారు. పర్యటనలో పాల్గొనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తక్షణ సేవలు అందించేలా వైద్య బృందాలు, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచామన్నారు. విద్యుత్, నీటి సరఫరా, కమ్యూనికేషన్, శానిటేషన్, రవాణా వంటి విభాగాలన్నీ ఒకే తాటిపై పనిచేస్తూ ఏర్పాట్లను విజయవంతంగా పూర్తి చేశారని కలెక్టర్ వివరించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పర్యటన సజావుగా సాగేందుకు అధి కారులు అప్రమత్తంగా ఉంటారని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు క్రమశిక్షణతో పాల్గొని ముఖ్య మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ భావన, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి సంబంధిత అధికారులు ఉన్నారు.

శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందింపజేయాలి

జెవివి జిల్లా మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు

మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

సమాజంలో శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందింపజేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని వై.వి.నాగిరెడ్డి డిగ్రీకళాశాలలో అన్నమయ్య జిల్లా జెవివి మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నాగేశ్వర రావుతో పాటు కోశాధికారి రాజశేఖర్‌రాహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాల విధాన నిర్ణయాలు శాస్త్ర పరిశోధనలను ప్రోత్సహించడానికి దోహదపడేలా ఉండాలన్నారు. విద్య,వైద్య రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లను పాలకులు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని పేర్కొన్నారు. మెరుగైన జీవనం కోసం ప్రజలు అశాస్త్రీయ విధానాలను విడనాడాలన్నారు. ప్రజల కోసం, ప్రగతికోసం, దేశ స్వావ లంబన కోసం జనవిజ్ఞాన వేదిక సైన్స్‌ను సమాజంలోకి తీసుకుపోతోందంటూ చెప్పారు. సైన్స్‌పట్ల అవగాహన కలిగివుంటే మెరుగైన జీవనాన్ని కొనసాగించవచ్చునంటూ తెలిపారు. జనవిజ్ఞానవేదిక మత, సాంస్కృతిక వారసత్వానికి వ్యతిరేకం కాదన్నారు. మూఢనమ్మకాలకు మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. శాస్త్రీయంగా నిజం కాదని నిరూపితమైన మన అలవాట్లను వెంటనే మార్చుకోవాలంటూ కోరారు.

జెవివి నూతన కమిటీ ఎన్నిక

మహాసభల అనంతరం జెవివి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జెవివి రాష్ట్రనేతలు ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా గుజ్జల చక్రప్రాణి, ప్రధాన కార్యదర్శిగా బాబా ఫకృద్దీన్, కోశాధికారిగా ఎం. జయచంద్ర ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, జిల్లా సైన్స్ అధికారి ఓబులరెడ్డి, డైట్ అధ్యాపకుడు శివ భాస్కర్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు రామకృష్ణ, జెవివి జిల్లా మాజీ అధ్యక్షులు ప్రభుచరణ్, ప్రధానకార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, సభ్యులు ప్రతాప్‌రెడ్డి, లక్ష్మిపతి, రఘునాథరెడ్డి, ఆనందరెడ్డి, లక్ష్మినారాయణ, రెడ్డిముని, సుధాకర్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంగా రాయచోటిని కొనసాగించాలి

రైట్ అప్ మాట్లాడుతున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటిని జిల్లా కేంద్రంగానే కొనసాగిస్తామని గత ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని అఖిల పక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ప్రాంగణంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద అఖిలపక్ష కమిటీ సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, రాజంపేట కేంద్రాలను ప్రత్యేక జిల్లాలుగా ఏర్పాటు చేస్తామని అదేవిధంగా రాయచోటి జిల్లా కేంద్రాన్ని కొనసా గిస్తామని గత సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల ప్రచార బహిరంగ సభల్లో చంద్రబాబు నాయుడు హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. మళ్లీ జిల్లా పునర్విభజన కోసమని మంత్రివర్గ కమిటీని వేశారని, దీంతో అన్నమయ్య జిల్లాలోని మూడు ప్రాంతాల ప్రజల్లో గందరగోళం నెలకొని ఉందని, అన్నమయ్య జిల్లాలో నెలకొని ఉన్న ఈ పరిస్థితిపై ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రకటన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాయచోటి జిల్లా కేంద్రంగా కొనసాగే అర్హతలు అన్నీ ఉన్నాయని జిల్లా కేంద్రానికి కావాల్సిన భూములు కానీ నీటి సౌకర్యం కానీ రాయచోటికి సమృద్ధిగా ఉన్నాయని, రాయలసీమలో అత్యంత వెనుకబా టతనం ఉన్న మండలాలైన గాలివీడు, ఎన్‌పి కుంట, పెద్దమండెం, చిన్నమండెం, గుర్రంకొండ, కలకడ, కె.విపల్లి, సంబేపల్లి,సుండుపల్లి, వీరపల్లి రామాపురం, లక్కిరెడ్డిపల్లి చక్రాయపేట మండలాలకు రాయచోటి కేంద్రంగా ఉందని పేర్కొన్నారు. సదరు వెనుకబడిన మండలాల అభివృద్ధి చేయడానికి రాయచోటి కేంద్రంగా జిల్లా కొనసాగాల్సిన అవసరం ఉందని అఖిలపక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఒపిడిఆర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఈశ్వర్, ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు, బిసి సంఘం నాయకులు విజయ భాస్కర్, నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ విశ్వనాథ, రజక సంఘం నాయకులు రమేష్ శ్రీనివాసులు రమణ, వడ్డెర విద్యావంతుల వేదిక చంద్రశేఖర్, ఎపిటిఎఫ్ హరిబాబు కాంగ్రెస్ నాయ కులు మహబూబ్ బాషా, భారత న్యాయవాదుల సంఘం నాయకులు ఆనంద్ కుమార్, చిన్నయ్య, హోమయున్ బాష, బాస్ నాయకులు తాతయ్య జకరయ్య, నాగేశ్వరరావు, జనసేన నాయకులు రామ శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, జర్నలిస్ట్ సంఘం నాయకులు నాగయ్య, రెడ్డెయ్య, రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరసింహులు

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి-రాయచోటి

ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి, కరువు భత్యం వెంటనే ప్రకటించాలని ఎపియుఎస్ జిల్లా అధ్యక్షులు నరసింహులు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కార్యదర్శుల సమావేశం స్థానిక కార్యాలయంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక బకాయిలు డిఎ, మధ్యంతర భృతి త్వరలో పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎపియుఎస్ రాష్ట్ర కార్యదర్శి మధుమతి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలు త్వరగా చెల్లించాలని కోరారు. జిల్లా సహాధ్యక్షులు నాగేంద్రబాబు మాట్లాడుతూ జిఓల బదిలీ పొంది న ఉపాధ్యాయుల స్థానంలో డిఎస్‌సి ద్వారా వచ్చే కొత్త ఉపాధ్యాయులను నియమించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సభ్యులు నాగేశ్వర్, జిల్లా కార్యదర్శి బాలాజీ, మల్లికార్జున, వెంకటయ్య ,మనోహర్, మోహన్, చంద్రశేఖర్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

రేపు కలకడ మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కలకడ

సోమవారం జరగాల్సిన కలకడ మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారానికి మార్పినట్లు ఎంపిడిఒ జగదీశ్వర్ తెలిపారు. సిఎం చంద్రబాబు సోమవారం రాజంపేటలో పర్యటన సందర్భంగా కలకడ మండల పరిషత్ సాధారణ సమావేశాన్ని మండల పరిషత్ అధ్యక్షులు వారి ఆదేశాలు మేరకు మంగళవారం ఉదయం 10.30కి మార్పినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, ఉప అధ్యక్షులు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని కోరారు.

పెద్దిరెడ్డయ్య యాదవ్‌ను సన్మానిస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ షఫీనాయక్

రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి మాజీ జడ్‌పిటిసి సభ్యులు యర్రగోర్ల పెద్దిరెడ్డయ్యయాదవ్ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్గా నియమితులైన సందర్భంగా లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎంటి షేక్ షఫీనాయక్ శాలువతో, బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దిరెడ్డయ్య యాదవ్ భవిష్యత్తులో మరెన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కార్యకర్తలు, యూనిట్ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

కడప-బెంగళూరు రైల్వే పనులకు రూ.960 కోట్లు

ప్రజాశక్తి-వీరబల్లి

కడప-బెంగళూరు రైల్వే పనులు పునః ప్రారంభానికి కేంద్ర ప్రభుత్వం రూ.960 కోట్లు కేటాయింపు జరిగిందని ఫార్మర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ రాజశేఖర్ రాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కడప- బెంగళూరు రైల్వే పనులు 2025-2026 బడ్జెట్ లో రూ.960 కోట్లు కేటాయించినట్లు రైల్వే శాఖామంత్రి అశ్విని వైష్ణవ్ లోకసభలో పేర్కొన్నారని చెప్పారు. 2010 లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు 21 కి.మీటర్లు పెండ్లిమర్రి వరకు పూర్తి అయ్యిందని అన్నారు. తదనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం పనులు నిలిపివేసిందని అన్నారు. రాయలసీమ రైతులలో, పారిశ్రామిక వేత్తలలో ఈ ప్రాజెక్టుపై ఆశలు చిగురించాయి. కడప-బెంగళూరు మొదటి ఫేస్ లో కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.8కి మీటర్లు మూడు ఫేస్‌లో వాయల్పాడు నుంచి మదనపల్లె వరకు 23 కిలోమీటర్లు రైల్వే లైన్ ఉందని అన్నారు. ఉద్యాన పంటలకు నిలయమైన కడప, అన్నమయ్య జిల్లాలు ఈ ప్రాంత రైతుల కోరిక మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కడప-బెంగళూరు రైలు లైను ప్రాజెక్టును పూర్తి చేస్తాయని ప్రజలు ఆశిస్తున్నారు.

మాట్లాడుతున్న పిటిఎం శివప్రసాద్

ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లకు మహోద్యమం

-24న సౌత్ ఇండియా సదస్సు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : సరళీకరణ, ప్రయివేటీకరణ వల్ల 90 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రయివేట్ రంగంలోకి వెళ్ళిపోవడంతో, ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన కోసం మరో స్వాతంత్ర పోరాటంలా మహోద్యమం చేపట్టనున్నట్లు, విదుతలై చిరుతైగల్ కట్చి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల ఆవశ్యకతపై అవగాహన-ఉద్యమ కార్యాచరణపై వివిధ పార్టీ -బాస్ సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. బాస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్ అధ్యక్షతన జరిగిన ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శివప్రసాద్ మాట్లాడుతూ. సూద్రులకు సమాన హక్కులు, పౌర హక్కులు సాధించడానికి అంబేద్కర్ బ్రిటిష్ వారితో పోరాడి కమ్యూనల్ అవార్డు సాధించారని చెప్పారు. సూద్రులు ఓటు హక్కుతో పాటు, విద్య, ఉద్యోగ, ఉపాధి హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రత్యేక నియోజ కవర్గాల అందుబాటులోకి వచ్చాయన్నారు. కమ్యూనల్ అవార్డు ఒడంబడికకు బదులుగా అందుబాటులోకి వచ్చిన రిజర్వేషన్లను సరళీకరణ-ప్రైవేటీకరణ కబలించడంతో రిజర్వేషన్ల వర్గాల ఉనికి, భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం ఉద్యమం చేపడతామని, 24న సౌత్ ఇండియా స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బాస్ రాష్ట్ర అధ్యక్షులు ఉలగనాథన్ గణపతి, కేంద్ర కమిటీ సభ్యుడు కె.వి.రమణ, విసికె, బాస్ నేతలు, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్తగా బోరు వేసినట్లు ఎంపిటిసి పద్మ రాజేకుమార్ తెలిపారు. విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మీగాయత్రి దృష్టికి తీసు కెళ్లారు. మండల గ్రాంట్ నుండి బోరు వేసేందుకు నిధులు విడుదల చేశారు. ఆ మేరకు ఆదివారం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో 600 అడుగుల బోరు వేశారు. రెండున్నర ఇంచ్ నీరు పడిందని ఎంపిటిసి తెలిపారు. విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు తొలగాయని ఆయన పేర్కొన్నారు

పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు

-ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

పార్టీకోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక స్థాయిలో గుర్తించి సంఘాలు బలోపేతం, వారి అభివృద్ధికి కృషి చేసే విధంగా ముందు కెళుతున్నామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలం పత్తేఘడ పంచాయతీ కొటాల గ్రామానికి చెందిన వాసు నూరి చంద్రశేఖర్ కు రాష్ట్ర జంగమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా నియామకం కావడంతో పట్టణంలోని హేమాచారి కల్యాణ మండపంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు జంగమ సంఘం నాయకులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీ.శే.అమర్నాథరెడ్డి కాలం నుంచి కూడా నల్లారి కుటుంబానికి అండగా ఉంటూ, ప్రతి కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయడంతో పాటు, తమ సంగం కోసం కృషి చేస్తూ అండగా నిలిచారని, జంగమ సంక్షేమ సంఘం అభివృద్ధికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. రాష్ట్ర జంగమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వాసునూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి చేపట్టబోయే ప్రభుత్వ, ప్రయివేట్ కార్యక్రమాలకు చేదోడు వాదోడుగా ఉంటూ ప్రతి కార్యక్రమం విజయవంతం చేసే దిశగా కృషి చేస్తానని రాష్ట్ర జంగమ సంఘం కార్పొరేషన్ చైర్మన్‌గా ఇవ్వడంతో, పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధికి పాటు పడుతూ సాయ శక్తుల కృషి చేస్తానని నాపై నమ్మకం ఉంచి కార్పొరేషన్ పదవి ఇచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ పదవితో పార్టీ అభివృద్ధి చేసే బాధ్యత నాపై పెరిగిందని, జీవి తాంతం పార్టీకి, ఎమ్మెల్యే కు విధేయుడిగా ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జంగమ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వినయ్ భూషణరావు, కలికిరి సింగల్ విండో అధ్యక్షులు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, వాల్మీకిపురం మాజీ ఎఎంసి చైర్మన్ నిరంజన్‌రెడ్డి, మధుబాబు రాంబాబు, మల్లయ్య, అశోక్‌రెడ్డి, రాజయ్య, బాలయ్య, శివశంకర్, చల్లయ్య పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ఘనంగా గణపతి నిమజ్జనం

కలకడ : వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ పరిధిలోని డి.బి.ఎన్ పల్లెలో గణపతిని ఐదవ రోజు ఆదివారం ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం ఉట్టి కొట్టే కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య నిర్వహించి విశేష అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ, బాణాసంచా పేలుస్తూ అత్యంత భక్తిశ్ర ద్ధలతో కోలాహలంగా వినాయకుడిని నిమజ్జనోత్సవానికి తరలించారు. వినా యకుని లడ్డూ వేలం పాటలో బాలిపోగు సుధాకర్ రూ.26,500కు దక్కించు కున్నారు. ఆయనను గ్రామ పెద్దలు పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానిం చి మంగళ వాయిద్యాల నడుమ ఇంటి వరకు ఘన స్వాగతం పలికారు. కార్యక్ర మంలో గ్రామ పెద్దలు టి.నారాయణ, ఎం.బాలనరసయ్య, టి,హరికృష్ణ, సుబ్బరాయుడు, ఎస్.నరసింహ, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. **కలకడ:** .మండల కేంద్రమైన కలకడ, వేణుగోపాలస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం, బాటవారిపల్లి పంచాయతీ నీలప్పగారి పల్లి సమీపంలో ఉన్న చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం దేవులపల్లి, రాతికుంటపల్లి, పాపి రెడ్డి గారి పల్లి ,ఎర్రయ్య గారిపల్లి, దేవులపల్లి, అగ్రహారం, నడిపిచర్ల, కోన తదితర గ్రామాలలో వినాయకుని విగ్రహాలను నిమర్జనం చేపట్టినట్టు తెలిపారు.నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రామాంజనేయులు తన సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు. **పీలేరు:** పట్టణంలో వినాయకుని విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు కోలాహలంగా జరిగాయి. స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద లాంఛనంగా మొదటి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని అనేక వీధుల్లో ప్రతిష్టించిన ఉత్సవ విగ్రహాలను వాటి నిర్వాహకులు వరుస క్రమంలో ప్రత్యేక వాహనాలపై ఊరే గింపు కార్యక్రమంలోకి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేరళ వాయిద్య బృంద కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు, డీజే సౌండ్ సిస్టంల మోతలతో పట్టణం మారు మ్రోగింది. స్థానిక పోలీసులు విగ్రహాల ఊరేగింపు సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. వినాయక చవితి ఉత్సవ కమిటీ పట్టణంలోని పంచాయితీ మిట్టపై వినాయక విగ్రహాల స్వాగత వేదికను ఏర్పాటు చేసి, పైనుంచి విగ్రహాలపై పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. పట్టణ శివారులోని అయ్యప్పనాయని చెరువులో విగ్రహాల నిమజ్జనం కోసం అవసరమైన ఏర్పాట్లను చేస్తూ క్రేన్లను సమకూర్చింది. అదేవిధంగా ట్రాక్టర్స్ అసోసియేషన్, ఆర్యవైశ్య సంఘం, వర్తక వ్యాపార సంఘాలు వేర్వేరుగా ఊరేగింపులో పాల్గొన్న జనానికి అల్పాహారం, చల్లని పానీయాలు, మజ్జిగ, మంచినీరు అందించ సాగారు. పట్టణ సిఐ యుగంధర్ తన సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. **నిమ్మనపల్లి:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో వినాయక పర్వదినం అనంతరం ఐదవ రోజు వినాయక నిమజ్జన ఊరేగింపు ఉత్సవాలను యువత, మహిళలు పెద్దలు కోలాహలంగా పాల్గొంటూ నిర్వహించారు. ఐదు రోజులపాటు వినాయకుని మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం రాత్రి వెంకోజిగారిపల్లెలో వినాయకుని లడ్డు వేలంపాటను నిర్వహించగా వెంకోజిగారిపల్లెకు చెందిన సైదుల్లి రూ.9,116లకు దక్కించుకున్నారు. అనంతరం అక్కడే భక్తులకు వినాయకుని లడ్డూను పంచిపెట్టారు. గ్రామాలలో పండుగలను సంతోషంగా సోదర భావంతో జరుపుకోవాలని కోరారు. ఆదివారం ఉదయం నుంచి వెంకోజీగారిపల్లెలోను, మండల వ్యాప్తంగాపలు ప్రాంతాలలో వినాయకుని నిమజ్జన కార్యక్రమాన్ని స్థానిక యువత ఉత్సాహంగా నిర్వహించారు. ఒకరికి ఒకరు రంగులు పూసుకుంటూ ఆనందంగా గణనాధున్ని నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా పోలీసులు పలు ప్రాంతాలలో బందోబస్తును నిర్వహించారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణంలోని సొసైటీ కాలనీ నందు గల విజయభారతి పాఠశాలలో ఏర్పాటు చేసిన వినాయకుడు నిమజ్జనం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పట్టణ పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు కన్నులపండుగలా సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్ సేతు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం శుభపరిణామం అన్నారు. పర్వదినాలు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలన్నారు.పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు నిమజ్జనం కార్యక్రమంలో నృత్యం చేస్తూ ఉత్సాహంగా పాల్గొనడం కనులవిందు చేసింది. అనంతరం ఊరేగింపుగా వెళ్లి తట్టివారిపల్లి చెరువులో నిమజ్జనాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నిశ్చిత, సాయి శేఖర్ రెడ్డి, గుడ్ విల్ కంప్యూటర్స్ అధినేత అజయ్ కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో ఆకట్టుకున్న కేరళ వాయిద్య బృందం

రూ.3.16 లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ

పుల్లంపేట : మండల పరిధిలోని ఉడుమువారిపల్లి గ్రామంలో వినాయక చవితి నిమజ్జనం పురస్కరించుకొని భారీ స్థాయిలో లడ్డూ వేలం పాట పలకడం జరిగింది. లడ్డు వేలం పాటకు ఆశవహులు ప్రయత్నించగా చివరికి ఆవుల రామ కిషోర్ రెడ్డి సతీమణి సమతారెడ్డి రూ.3.16 లక్షలు వినాయక లడ్డును క్రైసవం చేసుకోవడం జరిగింది. దేవుని ఆశీస్సులు వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని గ్రామస్తులు కొనియాడారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా విగ్రహాలు మంగంపేట నందు విగ్రహాన్ని నిమజ్జనం చేయడం జరిగింది. ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి ఆవాంఛనీయ సంఘటన జరగకుండా నిమజ్జనం నిర్వహించారు. **నందలూరు :** మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపం చాయతీ గొల్లపల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిం చిన వేలంపాటలో లడ్డూ రూ.70,500లు ధర పలికింది. అదే గ్రామానికి చెందిన సంపతి గిరిబాబు వేలం లో లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం గిరిబాబు మేళతాళాల నడుమ ఊరేగింపుగా లడ్డూను ఇంటికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గొబ్బిళ్ళ సుబ్బరాయుడు, హరి, వేణు, రవి, రమణకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుల్లంపేట : రూ.1.16లక్షలకు లడ్డూను దక్కించుకున్న రామకిషోర్‌రెడ్డి

వీధికుక్కల వీరంగం

- భయాందోళన చెందుతున్న ప్రజలు
- పట్టని మున్సిపల్ అధికారులు

ప్రధాన రహదారిలో గుంపులుగా ఉన్న శునకాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలో వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తున్నా, అధికారం గణం పట్టించుకోకపోవడంతో చిన్నారులు, ప్రజలు, మహిళలు భయాందోళనలకు గురవుతున్నారు.కుక్కల్ని నియంత్రించాల్సిన నగరపాలక పంచాయతీ అధికార యంత్రాంగం గత కొన్ని సంవత్సరాలుగా ఎటువంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు.నగర పంచాయతీలోని పారిశుధ్య కార్మికులు మినహా మిగిలిన అధికారులు,ఉన్నత పర్యవేక్షణ అధికారులు, సిబ్బంది వీధులవైపు కన్నెత్తి చూడటం లేదని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రజలకు కనీస సౌకర్యాలు వసతులు కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గతంతో పోలిస్తే నగర పంచాయతీ అయినప్పుడు నుంచి ఆదాయం ఐదు రెట్లు పెరిగిన కూడా ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని బాహాటంగా చెబుతున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి వీధికుక్కలు బారి నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

సీజన్స్ ట్రోఫీ సిటిఎం క్రాస్‌రోడ్ టీం కైవసం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గత రెండు రోజులుగా జరుగుతున్న సెకండ్ సీజన్ ఛాంపియన్ ట్రోఫీ క్రికెట్ పోటీలలో సిటిఎం క్రాస్ రోడ్ టీం విన్నర్‌గా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేత టీం కెప్టెన్ అనిల్‌కు మై ఫోర్స్ మహేష్ విన్నర్స్ ట్రోఫీని అందించారు. రన్నర్‌గా నిలిచిన ముదివేడు దిన్నిమీదపల్లె టీంకు మున్నూరు బాబా బహుమతిని అందించారు. ఆదివారం జరిగిన ఫైనల్స్ పోటీలలో 15 ఓవర్లకు సిటిఎం క్రాస్ రోడ్డు టీం 121 పరుగులు చేయగా, తర్వాత బ్యాటింగ్ కు వచ్చిన దిన్నిమీదపల్లె టీం 110 పరుగులకే ఆలౌట్ అయింది. ఫైనల్ మ్యాచ్‌లో కెప్టెన్ ఇనింగ్స్ ఆడిన అనిల్, హరిబాబులను అభినందించారు. కార్యక్రమంలో ఎఫ్ఐసిసి క్లబ్ డైరెక్టర్ హరిబాబు, వినయ్, దేవేంద్ర, గంగరాజు, మోని , మధు పాల్గొన్నారు.

ఆర్‌యుబి నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం వెంటనే పూర్తి చేసి రవాణా సౌకర్యం కల్పించాలని ఆర్‌యుబి సాధన కమిటీ సభ్యులు కోరారు. నిర్మాణం మధ్యలో ఆగి ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఆదివారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం హయాంలో రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరు చేశారని చెప్పారు. నిర్మాణం ప్రారంభించాక రాష్ట్ర ప్రభుత్వం వాటా పెండింగ్ పెట్టేసరికి నిర్మాణం ఆగిపోయిందని తెలిపారు. దీనివలన ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా ఉన్న వందలాది కుటుంబాలు రవాణా పరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫ్లై ఓవర్‌కు అవతల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలఉండడంతో నిత్యము వందలాదిమంది విద్యార్థులు అండర్ బ్రిడ్జి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారన్నారు. త్వరితగతిన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి తమను జూన్-2 పరిధిలోకి తీసుకురావాలని కోరారు. సోమవారం సిఎంకు వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌యుబి సాధన కమిటీ సభ్యులు బి.రాజా, సి.కేశవ, చిట్వేలి రవికుమార్, ఎలగంటి గోపీనాథ్, సత్య, సుబ్బరాయుడు, జానీ, మస్తాన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌యుబి సాధన కమిటీ సభ్యులు

పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న డిఐజి కోయప్రవీణ్

పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన డిఐజి

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన పోలీస్‌శాఖ వారి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఇండియన్ పెట్రోల్ బంకును కర్నూలు రేంజ్ డిఐజి కోయప్రవీణ్ ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం ఆయనతో పాటు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, సహచర పోలీస్ సిబ్బంది పాల్గొని పెట్రోల్ బంక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు నాణ్యమైన పెట్రోలు ను అందించడానికి పోలీసుల శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కలికిరి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ కు అదనంగా ఎస్ఐని నియమించాలని కోరగా, ఆయన స్పందిస్తూ పోలీస్ స్టేషన్ పరిధి పెరగలేదని, ఎస్ఐ విషయాన్ని పునః పరిశీలించి అవసరమైతే అదనంగా ఎస్ఐ నియామక ప్రక్రియ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐ అనిల్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పంపిణీకి సర్వం సిద్ధంగా ఉన్నట్లు ఎంపిడిఒ కృష్ణవేణి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలలో ఒకటైన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు.సెప్టెంబరు నెలకు సంబంధించి పెన్షన్లు పంపిణీ చేయుటకు మొత్తం రూ.3.36కోట్లు అన్ని సచివాలయాలు వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా డ్రా చేయడం జరిగిందన్నారు. మండలంలో మొత్తంగా 95 మంది వికలాంగులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో 83 మంది మాకు అర్హత ఉందని ఎంపిడిఒ లాగిన్‌లో అపీల్ చేసుకున్నారన్నారు. ఆపిల్ చేసుకున్న వీళ్ళందరికీ పెన్షన్ పంపిణీ జరుగుతుందని, మిగిలిన 12 మందికి వితంతువు, వృద్ధాప్యం కింద కన్వర్షన్ చేయడం జరిగిందన్నారు.అర్హత ఉన్న ప్రతి ఒక్క వికలాంగునికి కచ్చితంగా పెన్షన్ అందేటట్లు వెల్ఫేర్ అసిస్టెంట్ల ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఏడు గంటలకే అన్ని పంచాయతీల పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి పెన్షనుదారులకు పంపిణీ చేయవలసిందిగా కలెక్టర్ ఆదేశించారన్నారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి అందరూ సచివాలయ సిబ్బంది,వాళ్ల పరిధిలో ఉన్న పింఛను దారులకు పంపిణీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

తేక్వాండోలో బంగారు పతకాలు

ప్రజాశక్తి-నందలూరు : రైల్వేకోడూరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన రాయలసీమ స్థాయి తేక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలలో నందలూరు విజడమ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి బంగారు బహుమతులను గెలుచుకున్నారు. ఈ పోటీలలో అన్నమయ్య, తిరుపతి, కడప జిల్లా నుంచి తేక్వాండో విద్యార్థులు పాల్గొన్నారు. విజడమ్ పాఠశాల నుంచి పదిమంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో వలిమి మనోజ్ఞ, మోక్షిత్, విశిష్ట, నిర్వాన్ నందన్, గగన దీపిక, తసిఫా బంగారు పతకాలు సాధించారు. భువన్, షహనాజ్, సమీనా, సాజిద్ రజక పథకాలు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ వలిమిరాధ అభినందించారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో పథకాలు సాధించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ సుధాకర్ పాల్గొన్నారు.

సాధించిన పతకాలు చూపుతున్న విద్యార్థులు

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేవేంద్ర(ఫైల్ ఫొటో)

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో వెలుగు చూసింది. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ కథనం మేరకు..కురబలకోట మండలం, అంగళ్లు సమీపంలోని మల్లేశ్వరం చెరువులో అదివారం స్థానికులు వినాయకున్ని నిమజ్జనం చేసేందుకు వెళ్లారు. ఈ సమయంలో సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసున్న ఓ యువకుడి మృతదేహం బయటపడింది. గుర్తించిన స్థానికులు వెంటనే ముదివేడు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి , వివరాల కోసం గాలించారు. ఈ క్రమంలో మృతుడిది పుంగనూరు మండలం, మోదుగుపల్లికి చెందిన దేవేంద్ర అలియాస్ నాగేంద్ర (35)గా గుర్తించారు. ప్రమాద వశాత్తు చెరువులో పడి మృతి చెందాడా లేక ఎవరైనా హత్య చేసి చెరువులో పడేశారా అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెంపో వాహనం చోరీ

ప్రజాశక్తి-ములుకలచెరువు

మండల పరిధిలోని కాలువ పల్లికి చెందిన మొగల్ షామీర్ బేగ్ 407 టెంపో వాహనాన్ని బాడుగకు తిప్పుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి టమోటా మండికి బాడుగకు క్రేట్లను తీసుకువచ్చి తిరిగి వెళ్లే సమయంలో బ్రేకులు సరిగా పడకపోవడంతో ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాన్ని ఉంచానని తెలిపారు. శనివారం ఉదయం చూడగా రాత్రి తాను వాహనం నిలిపిన స్థలంలో వాహనం లేక కనిపించలేదని తెలిపాడు. స్నేహితులతో కలిసి మండలంలో పలుచోట్ల వెతికినట్లు తెలిపారు. వాహనం కనపడకపోయేసరికి చోరీకి గురైందని గ్రహించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు..పట్టణంలోని అబ్బయ్యగారివీధికి చెందిన రాజేష్ భార్య అర్చన(30) రెండేళ్ల కిందట కుటుంబ అవసరాల కోసం స్థానికంగా ఉంటున్న రాణి వద్ద రూ.లక్ష అప్పుగా తీసుకుంది. ప్రతినెలా వడ్డీ కింద రూ.10 వేలు చెల్లిస్తూ వచ్చింది. తీసుకున్న అప్పు రూ.లక్ష వెంటనే చెల్లించాల ంటూ కొద్దిరోజులుగా రాణి వేధింపులకు గురిచేయడంతో మనస్థాపం చెందిన అర్చన నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు బాధితురాలిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో రాణి వేధింపులు భరించలేకనే తన భార్య ఆత్మహత్యకు యత్నించిందని రాజేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.